ధర్మసోదరి

దుర్గంపూడి సోమరాజుగారు

ఆరోజున నేను పార్కువైపునకు షికారువెళ్లితిని పార్కును సమీపించి ఒకచోటకూర్చున్నాను వెనుక ఎవరో ఏడుస్తూవున్నట్లు వినిపించినది వెనుకకు తిరిగి చూచితిని ఇరువదిసంవత్సరముల యువతి కృశించినదేహముతో, వాడినమోముతో, కన్నులవెంట అశ్రువులరాల్చుచు, ధరించిన పాతచీరను సవరించుకొనుచు, నిలబడివున్నది ఆమె స్థితిని చూచుసరికి నాహృదయము నీరైపోయినది.

"ఎందుకమ్మా ఏడుస్తున్నావు" అని ప్రశ్నించితిని.

"ఏమీలేదుబాబూ" అని ప్రత్యుత్తరము కాని ఏడుపునిలిపినది

"ఏమనుకోకండి. చెప్పండి పరవాలేదు" అని మరల యడిగితిని

ఏమిచెప్పను – మూడురోజులనుండి భోజనం–" అని మరల యేడ్చుట కారంభించినది

"మూడురోజులనుండియు భోజనంలేదా?" అని ఆశ్చర్యముతో అడిగితిని

"లేదుబాబూ! మూడురోజులనుంచి–"

నా జేబునుండి డబ్బునుతీసి ఆమెకు ఇచ్చితిని

"డబ్బా! బాబూ" అని కంగారుపడుచు అడిగినది

"అవును, తీసుకో"

"వద్దుబాబూ! ఏమిచేసుకోను?"

"మరేమీభయంలేదు. తీసుకో"

"వద్దుబాబూ! డబ్బుమాత్రంవద్దు."

ఆమె మాటలవలన నాకు మరింత దయకలిగి "మంచిది, హోటలువరకు రా భోజనం పెట్టిస్తాను." అని అతికష్టముతో హోటలువద్దకు తీసుకువెళ్లితిని

"రామలింగా! అడిగినప్పుడంతా ఈమెకు భోజనము పెడుతూవుండు ఆడబ్బు నేనుయిస్తాను." అని చెప్పి, ఆమెదుస్థితికివగచుచు, భగవంతునిలీల తలపోయుచు, యింటిమార్గముబట్టితిని

మూడురోజులవరకు మరల ఆవైపునకువెళ్లుటకు తీరుబడిలేకపోయినది ఆరోజున హఠాత్తుగా జ్ఞాపకమువచ్చినది ఆయువతి ఏమైనదా? అని తొందరగా బయలుదేరి హోటలువద్దకు వెళ్లి—"రామలింగా! ఇప్పటివరకూ, ఆమెకోసం ఎంత ఖర్చుఅయింది?" అని అడిగితిని

"బాబూ! అప్పటినుండీ మళ్లీ ఆమె హోటలుకు రాలేదండీ నిన్న ఆమె ఇటువైపు వెళ్లుతూంటే నేను వెళ్లి ఆమెను తీసుకువచ్చాను ఆమెను ఎంత ప్రార్థించినా భోజనము చేయలేదు"

"మంచిది యీసారి ఆమె నీకు కనుపిస్తే మా యింటికి ఏలాగైనా వచ్చేటట్టుచేయి" అని నేను వెళ్లిపోయితిని నాలుగురోజులైనది నేను పేపరు చూచుకొనుచు ఆఫీసుగదిలో కూర్చొనియుంటిని మానౌకరు ఎవరినో కసరుచున్నట్లు వినుపించినది. ఎవరాని అని నేను వెళ్లిచూచితిని ఆ యువతిమీదనే వాడు కేకలు వేయుచున్నాడు వానినిమందలించి, ఆమెను లోపలకుపిలచితిని

ఆమె లోపలకువచ్చి "బాబుగారూ! తమరు ఎందుకు పిలిపించారు" అని ప్రశ్నించినది.

"అమ్మా ఏమీలేదు ఈలాకూర్చో నీవుచూస్తే ఉత్తమకాంతలా కనిపిస్తావు నీకీస్థితి ఎట్లాకలిగిందని

నీచరిత్ర తెలుసుకుందామని నాకు చాలా కుతూహలంగావుంది కాబట్టి సంకోచం లేకుండా నీకథఅంతా చెప్పాలి ”

“అయ్యో! నాకథ ఏమివింటారు ? నేను ఒక ఆపత్తులోబడి యిట్లాతిరుగుచున్నా యిదే నాకథ ”

“కాదమ్మా! ఇదిఅంతా నేనుచూస్తూనేవున్నాను కాబట్టి నీకథ మొదటినుండి విపులంగాచెప్పాలి ”

నమస్కారాలు బాబూ! తమరు చాలదయాళులు ఇప్పటివరకూ ఎవ్వరూ నన్నిట్లాఅడగలేదు చెప్పటానికి నా కథఏమివుంది ? తమవంటిసజ్జనులుఅడిగితే చెప్పకపోవడము ధర్మంకాదు కాని నిష్ప్రయోజనం ఆయిన నాజీవితచరిత్ర వినదలిస్తే, మీయొక్క అమూల్యమైనకాలమంతా వృథాఅయిపోతుంది ”

“కాదు, కాదు, నాపనికంటే నీచరిత్రే అమూల్యమైందని తలుస్తున్నా ”

“మంచిదిబాబూ! అట్లయితే వినండి నేను ఒక సాధారణకుటుంబంలో జన్మించాను తండ్రిపేరు ఏమిచెప్పనులెండి. వారు చాలాసజ్జనులు వారెంతో విచారించి, శ్రమపడి, బి ఏ చదివిన ఒకధనికుని కుమారుడికి నన్నిచ్చివివాహంచేశారు కాని ఏంలాభం నాతండ్రిగారు ఎంతఆశతో వివాహంచేశారో, అంతా వ్యర్థమైంది వెంకట్రావనే స్నేహితుని ప్రోత్సాహం చేత, నాభర్త త్రాగుడుకు అలవాటై, పూర్తిగా వేశ్యాలోలురైయ్యారు మందలించటానికి ఇంటిలో పెద్దలెవ్వరూలేరు అందుచేత వారిదుర్నడతలకు ఏమీ అడ్డులేకపోయింది నా భర్తగారితోపాటు వెంకట్రావుకూడా మాయింటికి తరచుగా వచ్చేడువాడు. ఏదో వంకతో నాతో మాటలుకలుపుతూ, నెమ్మదిగా వేళాకోళాలు ఆడడంకూడా ఆరంభిగాడు. అంతాగ్రహించి నేను తప్పుకొనితిరగ నారంభించాను అతనిచేష్టలన్నీ నాభర్తగారికి చెప్పాను ఇకమీదట అతనిని ఇంటికిరానివ్వద్దనికూడా చెప్పాను కాని ఏంలాభం ఎంతచెప్పినప్పటికీ, నాభర్తగారు చిరునవ్వునవ్వుతూ వూరుకొనేవారు. గాని అతడిరాకపోకలకుమాత్రం ఏమీ అడ్డుచెప్పలేదు

ఆతరువాత నా భర్తయింటికిరావడంకూడా అరుదైంది ఎప్పుడో వారానికి ఓసారివచ్చేవారు ఒకరోజున వెంకట్రావు వంటరిగావచ్చి—అదంతా ఎందుకులెండి అతనిని తలవాచేటట్లు చివాట్లు పెట్టాను అతనికి కోపంవచ్చి, నీభర్తను నీకు గాకుండా చేసి, నీకష్టకష్టాలు కలిగింపకపోతే నా పేరు వెంకట్రావు కాదని, కొన్నిదుర్భాషలాడి వెళ్లిపోయాడు నాటినుంచి నాభర్తజాడే తెలియకపోయింది. ఆయనకోసరం వెతికించాను. కాని ఉపయోగం లేకపోయింది అప్పటినుంచీ నాకు భయమెక్కువైంది ఇక అక్కడవుంటే వాడు అన్నంతపనీ చేస్తాడని తలచాను. ఆరాత్రేబయలుదేరి యీవూరు వచ్చాను ఈ వూళ్లోమాత్రం నాకెవరున్నారు నానాటికి నాకు బ్రతుకే కష్టమైపోయింది దీర్ఘచింత చేత నేనొక ఉన్మాదిగా అవుతున్నాను అనాథను, యిన్నిబాధ లనుభవిస్తూన్నాను ఆభగవంతుడు నన్ను యింకా ఎన్నికష్టాలపాలు చేయదలచాడో ?” అని ఆమెకన్నుల నీరునింప నారంభించినది. ఆమెను చూచిన నాకు చాలవిచారమైనది.

“అమ్మా! నీ వెంతవరకు చదివావు ?” అని అడిగితిని

“మావూరిస్కూల్లో అయిదవ తరగతి వరకు చదివాను తరువాత మాతండ్రిగారు భారత—భాగవతాలు యింటివద్దే చదివించారు.”

“మీతల్లితండ్రి లెక్కడున్నారు?”

“నాదురదృష్టం కొలదివారుకూడా అకాలమరణం పాలయ్యారు ”

“మాయిల్లులో పనిచేయడానికి నీకిష్టమేనా? అట్లాగైతే నీకీ కష్టాలుండవు ”

"మీకుదయవుంటే సంసిద్ధురాల్ని."

"మంచిది ఈ యింట్లోనే ఒక గదిలో నీవు ప్రత్యేకంగావుండు యీ పదిరూపాయలు తీసుకొని నీకు కావలసిన సామాన్లుతెచ్చుకో. నన్ను నీసోదరునిగ తలచుకో నాభార్యకూడ నీకు సహకారిణిగా వుంటుంది టైమయింది నేను మిల్లుకు వెళ్లివస్తాను" అని నేను మిల్లునకు వెళ్లితిని. సాయంకాలము ఇంటికి వచ్చితిని. నాభార్య ఎదురుగావచ్చి—సుశీలను మిల్లులో వుంచకండీ'' అనెను.

"సుశీల ఎవరూ?"

"మీక్రొత్త సోదరి"

నేను నవ్వుచు—"ఆమె పేరు సుశీలా?"

"అవును, ఆమె మంచి ఉత్తమురాలులా కనిపిస్తోంది అందుచేతే ఆమెను మిల్లులో వుంచవద్దని కోరుతున్నా. ఆమిల్లులో అనేకరకాల మనుష్యులుంటారు ఇంటిదగ్గిరేవుంచండి నాకూడా ఆసరంగావుంటుంది"

"కొన్నిరోజులు వెళ్లనీ మంచిచెడ్డలు బాగా విచారించి తరవాత యింటిదగ్గరేవుంచుతా"

"మీయిష్టప్రకారం చెయ్యండి"

ఆచ్చటినుండి సుశీల గదిలోపలకు వెళ్లితిని. ఆమె వంటచేసుకొనుచుండెను నన్ను చూచినతోడనే లేచి నిలచి—"వచ్చారా బాబూ!" అనెను.

అవును ఇక్కడ నీకేమీ కష్టంగా లేదుగదా?"

"లేదు బాబూ! మీ దయవల్ల ఎటువంటికష్టం గాని కొరతగాని లేదు"

"సుశీలా! ఇకనన్ను బాబూఅని పిలవడం మా అన్నయ్యా అని పిలువు నీవు నాకు సోదరివి." నా మాటలవలన ఆమెకు హర్షాతిరేకముతో కన్నుల నీళ్లు వచ్చినవి. రుద్ధకంఠములతో—"మంచిది ఇక మిమ్మ అన్నయ్యాఅనే పిలుస్తాను" అనెను

"అమ్మాయీ నేను వెళ్లుచున్నా నీకేమైనా అవసరం అయితే మీవదినగారిని అడుగు. సందేహంవద్దు"

"నేను అనుకున్నంతా జరిగింగి చూశారా పాపం?" అని నాభార్య అనెను

"ఏం జరిగింది" అంటిని నేను.

"ఇది చూడండి!" అని నాచేతికి ఒక కాగితపుముడత యిచ్చినది

అది చదివితిని నాకుఅమితమగు కోపము వచ్చినది "ఆ బద్మాషునకు యింతటి సాహసమా! ఇప్పుడే చెప్పెదను వానిపని." అని వెంటనే దుస్తులను ధరించి ఆఫీసునకు వెళ్లితిని. మేనేజరు పిలిపించి—"ఇదేమిటో చూడు! నీ వ్రాతేనా అది?" అని అడిగితిని. తప్పించుకొనుటకు వీలులేక అతను తడబడుచు—"అయ్యా! అవును అవును" అనెను.

"బుద్ధిలేదా? తుచ్ఛుడా! ఇట్టి దుర్నడత లెక్కడ నేర్చుకొన్నావు? ఆమె నాసోదరిఅని తెలియదూ నాపనిలోనుంచి ఇప్పుడే తొలగిపో ఇక క్షణమైనా యిక్కడ వుంటానికి వీల్లేదు" అని యింటికివచ్చితిని.

సుశీల దగ్గరకువెళ్లి, "సోదరీ! రేపటినుంచి నీవు మిల్లుకు వెళ్లవద్దు" అంటిని

"అన్నయ్యా! వెళ్లకపోతే ఊరకే నాబోటి అబలను ఎంతకాలం పోషిస్తారు. నే నొకదిక్కులేని పక్షిని" అని ఆమె అమితముగా దుఃఖింప నారంభించినది.

"అమ్మాయీ! నీవట్లు దుఃఖింపవద్దు నీవు అబలవు కావు సబలవు ఇంటివద్ద మీవదినగారికి తోడుగా వుండు"

సుశీల కన్నులవెంట ప్రేమాశ్రువులురాల "తమ దయ" అని లోపలకువెళ్లినది

గృహలక్ష్మి

నాటి ఉదయమున మేము ముగ్గురము కాఫీ త్రాగుచుంటిమి వాకిట దభాలుమని శబ్దమైనది సుశీల వెంటనే బయటకు వెళ్లినది ఆమె వెళ్లుటయే తడవుగ ఏడ్చుచున్న శబ్ధమును వినవచ్చినది ఆతురతతో నేను నాభార్యవెళ్లిచూడి చింకిగుడ్డలతోడను మాసిన గడ్డముతోడను కృశించిన దేహముతోడను ఒక వికృతాకారుడు మాచీడీలపైబడియుండ సుశీల రక్తము కారుచున్న వానిశిరమును ఒడియందు వుంచుకొని తుడుచుచు, మమ్ముల చూచుటయే తడవుగ పెద్దపెట్టున ఏడ్చుచు "అన్నయ్యా! వీరు నాభర్తగారు" అని ఏడువసాగినది "ఈతడు నీభర్తా! మరేమీ భయంలేదు" అని మేము ముగ్గురము అతనిని లోనికి తీసుకువచ్చి గాయమునకు కట్టుకట్టి మంచముపై పరుండబెట్టితిమి

ఒకమాసము దినములకు అతడుసరియగు ఆరోగ్యస్థితికి వచ్చెను. నేను వంటరిగానుండజూచి ఒకనాడు నావద్దకువచ్చి—"అయ్యా! ఇంతవరకు మీరు నా భార్యను దయతో కాపాడినందుకు మళ్లీ యిప్పుడు నాప్రాణాలు రక్షించినందుకు మీకు నా కృతజ్ఞతా వందనాలు. ఏపాపం ఎరుగని నేను ఒకమిత్రుని ప్రోత్సాహంచేత దురలవాట్లకు అలవాటుపడ్డాను నాభార్యని పడరానికష్టాల పాలుజేశాను నాఆస్తి అంతా పోగొట్టుకొన్నాను ఆఖరికి తింటానికి తిండి కూడా దొరక్క బిచ్చగాడినయ్యాను అంతా అయింది అయిందానికి విచారిస్తే లాభంలేదు కాబట్టి మీరు మీసోదరియందున్న దయకొలది నాకు కూడా మిల్లులో ఏదైనా ఒకపని యిప్పించకోరుతున్నా" అని దీనముగా అడిగాడు

అంతట నేను "ఇప్పటికైనా పశ్చాత్తాపం కలిగినందుకు సంతోషమైంది. ఇంతచదువు చదివావు ఏంలాభం బూడిదలోపోసిన పన్నీరు భ్రాంతిచేశావు పోనీలే యిప్పటినుంచైనా జాగ్రత్తగావుండు. కొద్ది రోజులక్రిందే మేనేజరు వెళ్లిపోయాడు ఆస్థానే నీవు వుండి జాగ్రత్తచూస్తూవుండు" అని చెప్పితిని

ప్రస్తుతమాతడు మాఆఫీసుమేనేజరు పదవిలో నున్నాడు ఆలుమగలు అరమరలులేక హాయిగా వుంటూవున్నారని నాభార్య పలుమారులు నాతో చెప్పుచుండును

నమస్సు

అ. సీతారాముడుగారు

తేనెతుంపురులు గురిసి తేటఁదనము
గలిగి వెలిఁగెడి కమ్మనికైతలల్లి
తెలుగుపలుకు వెలందిని దృప్తిపఱచి
కాఁపురముసల్పు కీరితి కన్నెఁగూడు
కైసరులఁ గడుపారఁగఁ గన్నతల్లి!

కత్తిచేఁబట్టి సంగరాంగణమువొచ్చి
శత్రువీరుల గుండియల్ జలదరింప
వారిమార్కొని చెండాడి పచ్చినెత్తు
టను వసంతమాడి విజయాంగననువలచి
వన్నెకెక్కినయోధులఁ గన్నతల్లి!!

అరిమహావీర నాగహర్యక్షులగుచుఁ
ప్రజలఁదాఁగన్న బిడ్డలవలెనెచూచి,
వారి కష్టసుఖముల నారసి పరి
పాలనము సేయు — ఆంధ్రగీర్వాణభాష
లందఖండమాపాండితిఁ బొందినట్టి
నిఖిలభువనప్రపూర్ణ నిర్ణిద్రమైన
ఖ్యాతిగల సార్వభౌములఁ గన్నతల్లి!!!

పగతుర నెదిర్చిపోరాడి వారివక్ష
ములఁజెకల్చి కండలను గ్రద్దలకు వేయఁ
గలిగినంతటి శౌర్యవతులగు వీర
వనితలనుగని విఖ్యాతి వడసినట్టి
అమలగుణగణాలంకృతా! ఆంధ్రమాత!!
సర్వలోకపూజ్యా! నమస్కారమమ్మ.